## క్లుప్తంగా

### సాగునీటి విడుదల



తమ్మిలేరు జలాశయం ఎడమకాల్వ నుంచి సాగు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

**చింతలపూడి:** నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు జలాశయం ఎడమ కాల్వ నుంచి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సోమవారం సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎడమ కాల్వ ద్వారా సుమారు 4 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేసినట్లు చెప్పారు. ఆయన వెంట తమ్మిలేరు డీఈ శ్రీనివాసరావు, ఏఈ పరమానందం, టీడీపీ, జనసేన నాయకులు, రైతులు ఉన్నారు.

### ప్రవీణ్ కుటుంబానికి విజయరాజు పరామర్శ



ప్రవీణ్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న కంభం విజయరాజు, పార్టీ శ్రేణులు

**లింగపాలెం:** ధర్మాజీగూడెంలో చుండ్రు ప్రవీణ్ కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, పార్టీ నేతలు సోమవారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో చుండ్రు ప్రవీణ్ (24) మృతి చెందడంతో అతని భౌతికకాయాన్ని విజయరాజు, పార్టీ నేతలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రవీణ్ కుటుంబానికి వారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చిన్న వయసులోనే ప్రవీణ్ మృతి బాధాకరమని, ఆ కుటుంబానికి తీరని లోటు అని అన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు నూతలపాటి శ్రీను, కొత్తూరు రమేష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

### రామనర్సాపురంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు



వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**బుట్టాయగూడెం:** మండలంలోని మారుమూల గ్రామమైన రామనర్సాపురంలో సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పి.వరప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేఆర్‌పురం ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సురేష్, డాక్టర్ భాగ్యశ్రీ వైద్య పరీక్షలు నిర్వహించారు. కిడ్నీ, మలేరియా, సీజనల్ వ్యాధులకు సంబంధించి సుమారు 300 మందికి పైగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రామనర్సాపురంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్మిస్తామని వరప్రసాదరావు తెలిపారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, రామ్‌లక్ష్మణ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ కుంజా నాగరాజు, గ్రామ పెద్దలు అశోక్ రెడ్డి, సత్యం పాల్గొన్నారు.

### పీహెచ్‌సీ తనిఖీ

**టి.నరసాపురం:** పీహెచ్‌సీలో శిశు విక్రయంపై వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం బొర్రంపాలెం పీహెచ్‌సీని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. సదరు సంఘటనపై ఆసుపత్రి సిబ్బందిని విచారించారు. శిశు విక్రయంపై మహిళను అడగ్గా, తన ఇష్ట ప్రకారమే పిల్లలు లేని దంపతులకు తన బిడ్డను ఇచ్చినట్లు ఆమె తెలియజేసింది. అనంతరం బాలరాజు ఆసుపత్రిని పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు అడపా నాగరాజు, ప్రధాన కార్యదర్శి మధ్యాహ్నపు చిన పెంటారావు, నవీన్, కంపసాటి రమేష్ పాల్గొన్నారు.

### రేపు ఉద్యోగ మేళా

**జంగారెడ్డిగూడెం:** స్థానిక ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 31న ఉదయం 10 గంటల నుంచి ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ప్రసాద్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రిటైల్ బ్యాంక్ మిత్ర, సంగీత మొబైల్ స్టోర్స్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, శ్రీసిటీ, టాటా విస్ట్రాన్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ అర్హత కలిగి, 18 ఏళ్లు పైబడిన వారు ఉద్యోగ మేళాలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పాల్గొనాలన్నారు. వివరాలకు 88868 82032 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

### ముక్కంటికి అన్నాభిషేకం

**కొయ్యలగూడెం:** అంకాలగూడెంలోని స్వయంభు శ్రీ ఉమా సమేత భోగలింగేశ్వర స్వామి వారికి సోమవారం అన్నాభిషేకం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి శివానంద ఆచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, మహా కుంభాభిషేక, విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు మామిళ్ళపల్లి దేసీతారాం, శివకుమార్, సుబ్రహ్మణ్య శర్మ, ఆలయ పాలకమండలి సభ్యులు, ఉత్సవ కమిటీ పాల్గొన్నారు.

# బస్టాండు.. సమస్యలు మెండు

- కామవరపుకోట కొత్తూరు బస్టాండ్‌లో అధ్వానంగా సౌకర్యాలు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు




ప్రయాణికులతో రద్దీగా ఉన్న కామవరపుకోట కొత్తూరు బస్టాండ్

**కామవరపుకోట:** కామవరపుకోట కొత్తూరు బస్టాండ్‌లో సరైన సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు ఈ బస్టాండ్‌కు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం నుంచి చింతలపూడి, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ద్వారక తిరుమల, తాడేపల్లిగూడెం, నరసాపురం వరకు జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు, విజయవాడ వరకు, హైదరాబాదు వంటి ముఖ్య నగరాలకు కూడా ఈ బస్టాండ్ నుంచి సర్వీస్‌లు ఉన్నాయి. ఈ బస్టాండ్ నుంచి నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు ఏలూరు, జంగారెడ్డిగూడెం, విజయవాడ వంటి పట్టణాలకు వెళ్తూ ఉంటారు. అలాగే ఆర్టీసీ కార్గో సౌకర్యం ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు సరుకు ఎగుమతి, దిగుమతి ఈ బస్టాండ్ నుంచే చేస్తుంటారు. దీంతో నిత్యం ప్రయాణికుల రద్దీ ఇక్కడ ఎక్కువగా ఉంటుంది. కానీ ఈ బస్టాండ్‌లో తాగేందుకు సరైన మంచినీటి సదుపాయం లేదు. అలాగే మరుగుదొడ్లు సైతం అధ్వానంగా ఉన్నాయి. అలాగే బస్టాండ్‌లో ప్రయాణికులకు కూర్చోవడానికి సరిపడా చోటు కూడా లేదు. దీంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలను కల్పించడంతోపాటు బస్టాండ్‌కు నూతన భవనాన్ని నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**సీసీ కెమెరాలు ఏర్పాటు చేయరూ..**

గత కొన్నేళ్ల నుంచి ఇక్కడ ద్విచక్ర వాహనాలతో పాటు, సెల్‌ఫోన్లు దొంగలించబడుతున్నాయి. వీటిని అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ దీపాలు మెరుగుపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు మీదుగా విజయవాడ వరకు రాకపోకలు సాగించే బస్సు సర్వీసులు సమయానికి రావడం లేదని, ఒకేసారి రెండు మూడు బస్సులు వస్తున్నాయని, తరువాత గంటకు పైగా బస్సు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

#### బస్టాండ్‌లో సరైన పర్యవేక్షణ లేదు



కొన్నేళ్ల నుంచి బస్టాండ్లో సరైన పర్యవేక్షణ లేక ద్విచక్ర వాహనాలతో పాటు, ప్రయాణికుల సెల్‌ఫోన్లు దొంగలించబడుతున్నాయి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే, బస్టాండ్‌లో దొంగతనాలను జరగకుండా నివారించవచ్చు. అదే విధంగా రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో ఇక్కడ అంతా చీకటిమయంగా ఉంటుంది. దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– సరస్వతి వెంకట నారాయణరాజు, కొత్తూరు గ్రామం

#### సదుపాయాలు మెరుగుపరచాలి



ఈ బస్టాండ్‌లో మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు సరిగ్గా లేక ప్రతిరోజు ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, విద్యార్థులు, దూర ప్రాంతాల నుంచి ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూర్చోవడానికి సరిపడా స్థలం కూడా లేదు. అధికారులు స్పందించి బస్టాండ్‌లో సదుపాయాలను మెరుగుపర్చాలి.

– కస్సే ప్రకాష్, ప్రయాణికుడు, కామవరపుకోట

#### బస్సు సర్వీసుల వేళలు పాటించాలి



జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు మీదుగా విజయవాడ వెళ్లి, వచ్చే బస్ సర్వీసులు సమయం ప్రకారం రావడం లేదు. ఒకేసారి రెండు, మూడు బస్సులు వస్తున్నాయి. తర్వాత అరగంట నుంచి గంట వరకు ఒక బస్సు కూడా రావడం లేదు. వేచి ఉండవలసి వస్తుంది. దీనివలన అత్యవసర ప్రయాణం చేయవలసి వస్తే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. బస్ సర్వీసులు సమయం ప్రకారం నడపాలి.

– మేరుగు బాబురావు, ప్రయాణికుడు, కొత్తూరు

### కూచిపూడిలో విద్యార్థినికి ప్రథమ బహుమతి



విద్యార్థిని రూపిక చౌదరిని అభినందిస్తున్న దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** శ్రీశ్రీ కళావేదిక కాకినాడ నందు జరిగిన కూచిపూడి పోటీల్లో ప్రథమ బహుమతిని సాధించి ఆగస్టు 18న జరిగే జాతీయ పోటీలకు తమ విద్యార్థిని సీహెచ్ రూపిక చౌదరి (7వ తరగతి) ఎంపికైనట్లు తపస్ విద్యాసంస్థల చైర్మన్ దాకారపు కృష్ణ తెలిపారు. సోమవారం ఈ మేరకు పాఠశాలలో విద్యార్థికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా సాంస్కృతిక రంగాల్లో కూడా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. రోటరీ ప్రెసిడెంట్ ఉడా రామ్‌గోపాల్, సెక్రెటరీ తిలక్ భవిరిశెట్టి, తపస్ సిబ్బంది విద్యార్థిని రూపిక చౌదరిని అభినందించారు.

## ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలి



జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఇఫ్టూ, భవన నిర్మాణ కార్మికులు, ట్రాక్టర్ అసోసియేషన్ నాయకులు

**జంగారెడ్డిగూడెం:** గోదావరి ఇసుక, వాగుల్లోని ఇసుకను రవాణా చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఇఫ్టూ, శ్రీబాలాజీ తాపీ మేస్త్రి పనివార్ల సంక్షేమ సంఘం, ట్రాక్టర్ డ్రైవర్ అండ్ ఓనర్స్ అసోసియేషన్, ప్రగతిశీల భవనిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, కార్యాలయ ఏవో సోమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తున్నామని అన్ని ప్రాంతాల నుంచి ఇసుక తీసుకు వెళ్లవచ్చని చంద్రబాబు ప్రకటించారని, అందుకు విరుద్ధంగా జంగారెడ్డిగూడెం డివిజన్‌లో అధికారుల పనితీరు ఉందని విమర్శించారు. ఏలూరు జిల్లాకు ర్యాంపులేనందున, ఇప్పటి వరకు తాము పోలవరం, పట్టిసీమ, కొవ్వూరు తదితర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్న గోదావరి ఇసుకను అడ్డుకుంటున్నారన్నారు. కుక్కునూరు వెళ్లి తెచ్చుకోవాలంటున్నారని, దూరాభారంతో పాటు, తెలంగాణ సరిహద్దు ఉండటంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అలాగే స్థానిక వాగుల్లోని ఇసుకను తెచ్చుకోవడానికి సైతం అధికారులు అడ్డు చెబుతున్నారన్నారు. దీంతో భవన నిర్మాణ ప్రక్రియలో పాలు పంచుకునే 33 రకాల వృత్తుల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ బాలాజీ తాపీ మేస్త్రి పనివారల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకట సూరిబాబు, ట్రాక్టర్ డ్రైవర్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు ఎస్.త్రినాథ్, ఆయా సంఘా నాయకులు మామిడి రామ్‌గోపాల్, దున్న బుజి మంగిన దుర్గారావు, యడ్లపల్లి ఏడుకొండలు, నారాయణ, సుబ్బారావు, మామిడి నారయ్య, ముప్పిడి సుబ్బారావు, కొంచాడ షణ్ముఖరావు, బలగం శివ, కొల్లు రాంబాబు, బాలిన ధర్మరాజు, తమ్మా సోమలింగ మల్లికార్జునరావు, కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు రావికంపాడు విద్యార్థులు



పతకాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, టాటా కంపెనీ సభ్యులు

**కామవరపుకోట:** రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికై నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు తెలిపారు. ఇటీవల ప్రముఖ టాటా కంపెనీ ఆధ్వర్యంలో పాఠశాలలో ×స్మార్ట్ ఇండియాలో యువత పాత్ర× అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో వైష్ణవి, సాయిలక్ష్మి బంగారు పతకం, శ్రీసౌమ్య, సాత్విక వెండి పతకం, సాయి వినయ్, మీనాక్షి కాంస్య పతకాలు పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో రాజధాని అమరావతిలో జరగబోవు రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పతకాలను సోమవారం సంస్థ ప్రతినిధులు సందీప్, రామాంజనేయులు పాఠశాలలో విద్యార్థులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, దేవప్రియ, సత్యనారాయణ, ప్రసాద్, సతీష్ కుమార్, పల్లాలు, మురళి, విజయకుమారి, సుజాత, చైతన్య, జయశ్రీ, రాజశ్రీ పాల్గొన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన తెలుగు ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులను గ్రామస్తులు అభినందించారు.

### తీజ్ మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



తీజ్ మహోత్సవం పోస్టర్, కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బంజారా బజరంగీ భేరి సంఘ సభ్యులు

**టి.నరసాపురం:** బంజారా బజరంగీ భేరి సంఘ ఆధ్వర్యంలో కృష్ణాపురం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు తీజ్ మహోత్సవం ప్రచార పోస్టర్, కరపత్రాన్ని సోమవారం సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ బంజారా ఆడపిల్లల కలల పండుగయే తీజ్ మహోత్సవం అని అన్నారు. సంఘ కోశాధికారి ధరావత్ రవి మాట్లాడుతూ తీజ్ పండుగ జరపడంలో ముఖ్య ఉద్దేశ్యం పాడి పంటలు, సిరిసంపదలతో గ్రామాలు కళకళలాడాలని, తమ బంజారా జాతి అభివృద్ధి చెందాలని, ఆడపిల్లలు చిన్నప్పటి నుంచి ఆత్మస్థైర్యం, మానవీయ విలువలతో పెరిగేలా చేయడమని అన్నారు. తీజ్ ఉత్సవ కమిటీ నాయకురాలు భూక్యా రామలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తీజ్ ఉత్సవంను కృష్ణాపురం గ్రామంలో ఆగస్టు 18 నుంచి 26 వరకు తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా సురేష్, ధరావత్ బంగారయ్య, జరభల రమా దేవి, భూక్యా సోమమ్మ, దేశావత్ రంజిత్ భూక్యా వాలి భూక్యా రాములు, భూక్యా సత్యం తదితరులు పాల్గొన్నారు.

### సమగ్ర యాజమాన్య పద్ధతులతో కలుపు నివారణ



బొర్రంపాలెంలో వరిపంటను పరిశీలిస్తున్న దృశ్యం

**చింతలపూడి:** సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా వరిలో కలుపు నివారణ చేసుకోవచ్చునని ఏలూరు డాట్ సెంటర్ శాస్త్రవేత్త డా ఫణికుమార్ తెలిపారు. ప్రగడవరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాట్లు వేసిన వెంటనే వెడల్పాటి, తుంగ, గరిక కలుపు నివారణకై పెట్రిల్లా క్లోర్, బెన్ సల్ఫ్యూర్యాన్ మిథైల్‌ను 4 కేజీలను ఎకరానికి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. నాట్లు వేసిన తరువాత 5 రోజుల్లో కలుపు ఉంటే పెట్రిల్లా క్లోర్ లేదా పైరజో సల్ఫ్యూరాన్ మిథైల్‌ను ఎకరానికి 120 గ్రాములు చల్లుకోవాలన్నారు. నాట్లు వేసిన 11 నుంచి 15 రోజుల్లో అయితే బిస్‌పైర్ బ్యాక్ సోడియం ఎకరానికి 100 గ్రాములు పిచికారీ చేసుకుంటే వెడల్పాటి తుంగ కలుపును నివారించవచ్చునని తెలిపారు. నాట్లు వేసిన 20 నుంచి 25 రోజులకు కలుపు ఉంటే 2-4డి సోడియం సాల్ట్‌ను ఎకరానికి 400 గ్రాములు చల్లుకోవాలని సూచించారు. ఏలూరు ఏడీఏ లలిత సుధ, ఏఓ మీనాకుమారి పాల్గొన్నారు.

**టి.నరసాపురం:** వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలో యాజమాన్య పద్ధతులు తప్పకుండా పాటించాలని ఏడీఏ పి.లలిత సుధ రైతులకు సూచించారు. బొర్రంపాలెం రైతు సేవా కేంద్రంలో సోమవారం యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏవో బి.సుమలత, రైతు కేంద్రం సిబ్బంది ఎస్.శ్రీకన్య, కె.దీపిక, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

## తగ్గిన వరద



ఇంకా పంట చేలల్లోనే ఉన్న గోదావరి వరద నీరు

**కుక్కునూరు:** గత వారం రోజులుగా ఎగువన కురిసిన వర్షాలతో గోదావరి నీటిమట్టం పెరుగుతూ తగ్గుతూ వచ్చింది. భద్రాచలం వద్ద మూడవ ప్రమాద హెచ్చరికను దాటి వరద ప్రవాహం చేరడంతో విలీన మండలాల ప్రజలు బెండలెత్తిపోయారు. వరద తీవ్రత ఎంతవరకు వెళుతుందో అన్న ఆందోళన పడ్డారు. గోదావరి పరీవాహక ప్రాంతాలలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. సోమవారం భద్రాచలం వద్ద సీడబ్ల్యూసీ అధికారులు రెండవ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. కాగా గోదావరి ప్రవాహం రెండవ ప్రమాద హెచ్చరికకు దిగువున 45 అడుగులకు చేరుకుంది. వరద తగ్గుముఖం పట్టడంతో రోడ్లన్నీ వరదనీటి నుండి బయటపడుతున్నాయి. కుక్కునూరు నుంచి బూర్గంపాడు ఆర్‌అండ్‌బీ రహదారిపై రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. గ్రామాల్లోని పంటచేలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. రానున్న రోజుల్లో ఎలా ఉంటుందో అన్న ఆందోళన విలీన మండలాల ప్రజల్లో నెలకొంది. ఇకనైనా ప్రభుత్వం కాంటూర్ లెవెల్స్‌తో సంబంధం లేకుండా ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అందించి పునరావాస కాలనీలకు తరలిస్తే తమకు ఈ ఇబ్బందులు తప్పుతాయని పలువురు అంటున్నారు.

### ఫేక్ ఫోన్‌పే యాప్‌తో మోసానికి యత్నం

**జంగారెడ్డిగూడెం:** ఫేక్ ఫోన్‌పే యాప్‌తో మోసానికి యత్నించిన ఘటన జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గంగానమ్మ గుడి సందులోని ఒక షాపులో సెల్‌ఫోన్ కొనుగోలు చేసేందుకు ఒక యువకుడు వెళ్లాడు. అక్కడ రూ. 12500 విలువైన ఫోన్‌ను కొనుగోలు చేసి ఫోన్‌పే ద్వారా అమౌంట్ చెల్లించాడు. అయితే యువకుడి ఫోన్‌లో డబ్బులు కట్ అయినట్లుగా చూపించి, ట్రాన్సాక్షన్ ఐడీ వచ్చింది.. కానీ సెల్‌ఫోన్ షాపు యజమాని ఖాతాలోకి నగదు జమ కాలేదు. దీంతో అనుమానం వచ్చిన షాపు యజమాని రూ.50 వేలు అమౌంట్ వేయాలని సదరు యువకుడిని అడిగాడు. ఆ యువకుడు వెంటనే రూ.50 వేలు చెల్లించినట్లు చూపినా ఆ మొత్తం కూడా సెల్‌షాపు యజమాని బ్యాంకు అకౌంట్‌లో జమ కాలేదు. దీంతో ఆ యువకుడిని సెల్‌ఫోన్ షాపు యజమాని, స్థానికులు కలిసి పోలీసులకు అప్పగించారు.

### ఏటీఎం కార్డు మార్చి నగదు చోరీ

**జంగారెడ్డిగూడెం:** గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం కార్డు మార్చి తన ఖాతాలో నగదు చోరీ చేసినట్లు బుట్టాయగూడెం మండలం మర్లగూడానికి చెందిన వృద్ధుడు పరిటాల లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం.. లక్ష్మీనారాయణకు జంగారెడ్డిగూడెం కొవ్వూరు రోడ్డులోని యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఉంది. ఈ నెల 27న ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు వెళ్లాడు. తాను నిరక్షరాస్యుడు కావడంతో ఏటీఎం సెంటర్‌లో ఉన్న యువతి, యువకుడిని సంప్రదించగా, వారు రూ.3500 డబ్బులు డ్రాచేసి లక్ష్మీనారాయణకు ఇచ్చారు. సోమవారం తన పాస్‌పుస్తకంలో పోస్టింగ్ వేయించుకోవడానికి వెళ్లిన లక్ష్మీనారాయణకు తన ఖాతాలో దపదపాలుగా రూ.31,500 నగదు విత్‌డ్రా అయిన విషయాన్ని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన ఏటీఎం కార్డు మార్చి తన ఖాతాలో నుంచి సొమ్ముఅపహరించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

### విద్యార్థులకు పౌష్టికాహార మధ్యాహ్న భోజనం



కొయ్యలగూడెం: కన్నాపురం స్కూల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్న దృశ్యం

**కొయ్యలగూడెం:** కేంద్ర ప్రభుత్వం పిలుపుమేరకు మండలంలో పలుచోట్ల స్వచ్ఛంద సంస్థలు శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కన్నాపురంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపీ (మట్టి ప్రసాద్) ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా 150 మంది విద్యార్థులకు పోషకాలతో కూడిన పౌష్టికాహార మధ్యాహ్న భోజనం అందజేశారు. వాసవి క్లబ్ సభ్యులు మట్టే శ్రీను, గుడిమెట్ల గంగాధరం, బొమ్మ మురళి, ఎంపీటీసీ కాగితాల గణపతి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొయ్యలగూడెం మానవత శాఖ ద్వారా హైస్కూల్‌లో విద్యార్థులకు అరటి పళ్ళు, పెరుగు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

**లింగపాలెం:** శిక్షా సప్తాహ్ శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ధర్మాజీగూడెంలో ప్రాథమిక పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించారు. టీడీపీ సీనియర్ నాయకులు గారపాటి బుజ్జియ్య స్వీటు, హాటు, పండ్లు విద్యార్థులకు అందించారు. అనంతరం ఎమ్మెల్యే, నాయకులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు.

**ద్వారకాతిరుమల:** ఎం.నాగులపల్లి ఎంపీయూపీ పాఠశాలలో శిక్షా సప్తాహ్ సందర్భంగా సోమవారం విద్యార్థులకు శుభ తిథి భోజనాన్ని అందించారు. బిర్యానీ, ఎగ్ కర్రీ, స్వీట్, చికెన్ కర్రీ, చిక్కి, పెరుగుతో భోజనం వడ్డించారు.

**పోలవరం రూరల్:** పోలవరం మండలం కొండ్రుకోటలోని ఎంపీయూపీ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా దాతల సహకారంతో 150 మంది విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పే లక్ష్మయ్య తెలిపారు.

**జంగారెడ్డిగూడెం:** స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం దాతల సహకారంతో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించారు. హెచ్ఎం కేఎస్‌వీ లోవకుమారి, దాతలు సిటీకేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, డాక్టర్ కోట సునీత, డాక్టర్ కాకర్ల రామచంద్రబాబు, కె.రామకృష్ణ, పి.సత్యనారాయణ, ఉక్కుర్తి సీతారామ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కామవరపుకోట:** ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగపరచుకోవాలని టీడీపీ నాయకులు, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే గంటా మురళి రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా గ్రామ పెద్దల సహకారంతో విద్యార్థులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ద్వారకాతిరుమల:** మండలంలోని ద్వారకాతిరుమల, దొరసానిపాడు గ్రామాలతో పాటు శ్రీవారి ఆలయానికి మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఆ శాఖ ఈఈ జేపీబీ నటరాజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారకతిరుమల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఎంహెచ్‌క్యూ ఫీడర్, 11 కేవీ టెంపుల్ ఫీడర్, 11 కేవీ దొరసానిపాడు ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. అందువల్ల ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

**కామవరపుకోటలో...**

**కామవరపుకోట:** ఈనెల 30వ తేదీ నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు 400 కేవీ లైన్ పనుల నిమిత్తం 33/11 కేవీ ఆడమిల్లి విద్యుత్ ఉప కేంద్రం నుంచి చిన్నమ్మారావుపాలెం ఫీడర్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. రాధాకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### జీసీసీ అకౌంటెంట్‌పై చర్యలకు డిమాండ్

**కుక్కునూరు:** సక్రమంగా విధులకు హాజరుకాని కుక్కునూరు గిరిజన సహకార సంస్థ అకౌంటెంట్ బి.బాబురావుపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి నాగేంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓవైపు భారీ వర్షాలు, మరోవైపు గోదావరి వరదలు మండలాన్ని చుట్టుముట్టి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇటువంటి సమయంలో వరద బాధితులకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేసే జీసీసీలో పనిచేసే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. జీసీసీలో అకౌంటెంట్, గోడౌన్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయాల్సిన బాబూరావు ఉన్నతాధికారుల ఆదేశాలను తుంగలో తొక్కి తన ఇష్టం వచ్చినట్లు చేస్తూ విధులకు గైర్హాజరవుతున్నాడని, ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నాగేంద్రరావు కోరుతున్నారు.

### పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

**చింతలపూడి:** చింతలపూడి మండలంలోని 21 రూరల్ సచివాలయాల్లో ఆగస్టు 1వ తేదీన పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ చిన్నరాట్నాలు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మొత్తం 9,532 మంది పింఛన్‌దారులకు రూ.4,07,22,500 విడుదలైనట్లు చెప్పారు. పింఛన్‌దారులు ఎవ్వరూ గుంపులు, గుంపులుగా రావద్దని సచివాలయ సిబ్బంది ఇంటివద్దకే వచ్చి పింఛన్ అందజేస్తారని తెలిపారు.

### యాచకుడు మృతి

**ద్వారకాతిరుమల:** శ్రీవారి కొండపైన ఒక కల్యాణ మండపంలో గుర్తు తెలియని యాచకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది ఈ విషయాన్ని సోమవారం గుర్తించారు. వివరాల ప్రకారం. సాయంత్రం కొండపైన సెంట్రల్ పార్కింగ్ వైపునకు వెళ్లిన సెక్యూరిటీ సిబ్బంది ఆ ప్రాంతంలోని నారాయణ కల్యాణ మండపంలో నుంచి తీవ్ర దుర్వాసన రావడాన్ని గుర్తించారు. లోపలికి వెళ్లి గది తలుపులు తెరచి చూడగా, యాచకుడి మృతదేహం కనిపించింది. మృతదేహం ఉన్న తీరును బట్టి యాచకుడు రెండు, మూడు రోజుల క్రితమే చనిపోయినట్టుగా గుర్తించారు. వెంటనే సెక్యూరిటీ సిబ్బంది స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా, హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని ఖననం నిమిత్తం తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.